మార్పు కోసం...

# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

ప్రచురణ : హైదరాబాద్, ఖమ్మం, అమరావతి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి/ చీఫ్ ఎడిటర్ : జి. శ్రీధర్ /సంపుటి :5 సంచిక 206 14 ఆదివారం, జనవరి 2024 పేజీలు: 4/వెల రూ5/-

విలేకరులు కావలెను

హైదరాబాద్, అమరావతి కేంద్రాలుగా నడుపబడుతున్న

మరో ఉదయం

(అక్రిడేషన్ కలిగి ఉన్న) తెలుగు దినపత్రికకు తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ లలోని అన్ని జిల్లాలకు ఇన్చార్జులు, నియోజకవర్గం మండలాలకు విలేకరులు కావలెను

మరిన్ని వివరాలకు సంపాదించండి

సెల్:9154842842

## త్వరలో మెగా డీఎస్సీ నోటిఫికేషన్... మంత్రి బొత్స వెల్లడి

సంక్రాంతి కానుకగా డీఎస్సీ ప్రకటన ఉంటుందన్న బొత్స

సీఎం జగన్ తోనూ మాట్లాడామని వెల్లడి

సంక్రాంతి తర్వాత ప్రకటన ఉంటుందని స్పష్టీకరణ



ఏపీలో నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సంక్రాంతి తర్వాత మెగా డీఎస్సీ ప్రకటించనున్నట్టు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ కు సంబంధించిన వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. సీఎం జగన్ తోనూ నోటిఫికేషన్ గురించి మాట్లాడామని, పోస్టుల సంఖ్యపై స్పష్టత రాగానే, నోటిఫికేషన్ ఉంటుందని అన్నారు. ఏ ఏ జిల్లాల్లో ఖాళీలు ఉన్నాయి, వాటి భర్తీ విధానాలను ఖరారు చేయాల్సి ఉందని బొత్స పేర్కొన్నారు.ఏపీలో గత కొన్నాళ్లుగా డీఎస్సీ ప్రకటన లేకపోవడంతో ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్ర నిరుత్సాహానికి లోనై ఉన్నారు. ఈ నేపథ్యంలో, త్వరలో నోటిఫికేషన్ వస్తే వారికి ఇది కచ్చితంగా తియ్యని వార్తే కానుంది.

ప్రభుత్వం ఒకరికి మంచి చేస్తూ ఇంకొకరి

## ఉసురు పోసుకోవద్దు



**సిద్దిపేట: జనవరి 13,(మరో ఉదయం)**

కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులను రోడ్డున పడేసిందని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో ఉన్నారని చెప్పారు. వారికి ప్రతి నెల రూ.15 వేల జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా డిగ్రీ కళాశాల మైదానంలో ఆటో డ్రైవర్ల ఆటల పోటీలను హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటోకార్మికులు కొన్ని రోజులుగా నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ఒకరికి మంచి చేస్తూ ఇంకొకరి ఉసురు పోసుకోవద్దని సూచించారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మంచి కార్యక్రమమే అయినప్పటికీ.. బస్సులు దొరక్క ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మారుమూల గ్రామాలకు మరిన్ని బస్ సౌకర్యాలు పెంచాలని తెలిపారు. ఆటో కార్మికులకు నెలకు 15వేల జీవన భృతి కల్పించాలని, లేదంటే వారు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని వెల్లడించారు. ఆటోవాలలా జీవితంలో పండుగ వాతావరణం కనుమరుగైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమ బాధలు గట్టెక్కుతాయని అనుకున్నారని, కానీ వచ్చిన వారం రోజులకే ఇలా రోడ్డున పడతామని అనుకోలేదంటున్నారని వ్యాఖ్యానించారు.

## ఇండియా కూటమి చైర్మన్‌గా ఖర్గే

కూటమి సమన్వయకర్తగా నితీష్ కుమార్

వర్చువల్ సమావేశంలో కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ,జనవరి13(మరో ఉదయం):**

ఇండియా కూటమి నేతల వర్చువల్ సమావేశంలో పాల్గొనింది. ఈ మీటింగ్ లో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను కూటమి చైర్మన్ గా నియమించింది. అదే సమయంలో బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ జాతీయ అధ్యక్షుడు నితీష్ కుమార్‌ను కూటమికి సమన్వయకర్తగా ఎన్నిక అయ్యారు. దాదాపుగా కూటమిలోని అన్ని పార్టీల నేతలు ఆయన పేరును ఏకగ్రీవంగా ప్రతిపాదించారు. దీంతో పాటు సీట్ల పంపకంలో ఎదురవుతున్న సవాళ్ల పైనా ప్రధానంగా చర్చించారు. అయితే, కోఆర్డినేటర్ పదవి ప్రతిపాదనపై నితీష్ కుమార్ మొదట మాట్లాడుతూ.. నాకు ఏ పదవి పైనా కోరిక లేదన్నారు. గతంలో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధానమంత్రి పదవికి మల్లికార్జున ఖర్గే పేరును ప్రతిపాదించారు. ఆ ప్రతి పాదనకు ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మద్దతు ఇచ్చారు. ఇక, ఈ సమావేశానికి ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు తేజస్వీ యాదవ్, ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు పలువురు నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశానికి టీఎంసి అధినేత్రి మమతా బెనర్జీ, ఉద్ధవ్ ఠాక్రే, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ హాజరు కాలేదు. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ఇండియా అలయన్స్ కన్వీనర్‌గా ఉండటానికి నిరాకరించారు. ఇండియా కూటమి కన్వీనర్ పదవిని చేపట్టానికి బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ నిరాకరించారు. కూటమి నేతల సమావేశంలో నితీష్ కుమార్ పేరును కాంగ్రెస్ నేతలు ప్రతిపాదించారు. అయితే ఆ పదవిపై తనకు ఆసక్తి లేదని, క్షేత్రస్థాయిలో ఇండియా కూటమిని బలోపేతం చేయడమే లక్ష్యమని ప్రకటించారు వాస్తవానికి రాహుల్‌గాంధీ జనవరి 14 నుంచి చేపట్టబోయే భారత్ జోడో న్యాయ్‌యాత్రకు హాజరుకావాలని మిత్రపక్షాలను ఆహ్వానించేందుకే ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

## చంద్రబాబుతో షర్మిల భేటీ.. కుమారుడి వివాహానికి ఆహ్వానం

**విజయవాడ,జనవరి13(మరో ఉదయం):**

టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబును ఏపీ సీఎం వైఎస్ జగన్ సోదరి, కాంగ్రెస్ నేత వైఎస్ షర్మిల కలిశారు. హైదరాబాద్‌లోని చంద్రబాబు నివాసానికి ఆమె వెళ్లారు. తన కుమారుడు రాజారెడ్డి వివాహ ఆహ్వాన పత్రికను అందించారు. ప్రతి విషయాన్ని రాజ కీయాలతో ముడిపెట్టవద్దని కోరారు. కేటీఆర్, కవిత, హరీశ్‌రావుకు కూడా స్వీట్లు పంపానని అన్నారు. "రాజకీయం అనేది మా జీవితం కాదు, అది మా వృత్తి. ప్రజా పోరాటంలో భాగంగా విమర్శలు చేసుకుంటాం కానీ.. రాజకీయాల్లో వ్యక్తిగత కక్షలు ఉండకూడదు. స్నేహపూర్వక వాతావరణం ఉండాలి. నాకు ఏ బాధ్యతలు ఇవ్వాలనేది కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఇష్టం. రాహుల్ గాంధీని ప్రధానిగా చేయాలని వైఎస్ఆర్ అనేవారు. రాహుల్ ప్రధాని అయితేనే దేశంలో మతకలహాలు తగ్గుతాయి" అని షర్మిల అన్నారు.

## ఆటో కార్మికులను ఆదుకోవాలి

15వేల జీవనభృతి ఇవ్వాలి

హరీష్ రావు డిమాండ్



**సిద్దిపేట,జనవరి13(మరో ఉదయం):**

మిగతా 2 లో




## జులైలో జీతాలు పెంచుతాం...

ఏపీలో కొన్ని వారాలుగా అంగన్వాడీల సమ్మె

ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలంటూ అంగన్వాడీల డిమాండ్

ఉద్యోగుల పట్ల ప్రభుత్వం పూర్తి సానుభూతితో ఉందన్న సజ్జల

**జనవరి 13,(మరో ఉదయం)**



ఏపీలో ఓవైపు అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తుండగా, మరోవైపు మున్సిపల్ కార్మికులు కూడా డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వానికి ఉద్యోగుల పట్ల సానుభూతి ఉందని తెలిపారు. జులైలో అందరికీ ఆమోదయోగ్యమైన విధంగా వేతనాలు పెంచుతామని వెల్లడించారు. యూనియన్లు ఇప్పటికైనా ఆలోచించి సమ్మె విరమించుకోవాలని సజ్జల పిలుపునిచ్చారు. "అంగన్వాడీ కార్యకర్తలకు నేరుగా విజ్ఞప్తి చేస్తున్నాం... ఇది జగన్ మోహన్ రెడ్డి గారి ప్రభుత్వం. పూర్తిగా పేదల పక్షపాత ప్రభుత్వం. ఉద్యోగుల పట్ల, ముఖ్యంగా అంగన్వాడీ కార్యకర్తల పట్ల మరింత ఆదరణ కలిగిన ప్రభుత్వం. మీరు కూడా ప్రభుత్వంలో భాగమే. మీ బాధ్యతను మీరు సక్రమంగా నిర్వర్తించకపోతే... సమాజానికి అందాల్సిన సేవలు అందవు కాబట్టి దయచేసి అర్థం చేసుకోండి. వెంటనే సమ్మెను విరమించాలని యూనియన్లకు, యూనియన్ల ప్రతినిధులకు, అంగన్వాడీ కార్యకర్తలకు, సహాయకులకు విజ్ఞప్తి చేస్తున్నాం" అంటూ సజ్జల ప్రభుత్వ గళం వినిపించారు.

## నూతన పారిశ్రామిక కారిడార్లు

జాతీయ చేనేత కేంద్రం ఏర్పాటు కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌లో సిఎం రేవంత్ చర్చలు



మిగతా 2 లో

**న్యూఢిల్లీ,జనవరి13(మరో ఉదయం):**

మార్పు కోసం... మరో ఉదయం
TELUGU DAILY & NEWS CHANNEL

# సంపాదకీయం

## ఊరంతా సంక్రాంతి

సంక్రాంతితో పల్లెల్లో జనాల రాకతో కళకళలాడుతున్నాయి. ఎపిలోని పల్లెల్లో ఆడపడచుల రాకతో పల్లెల్లో సందడి వాతావవరణం నెలకొంది. ఈ క్రమంలో ఇంకా కొందరు తమ స్వస్థలాలకు వెడుతూనే ఉన్నారు. జిల్లాల్లో సంక్రాంతి పండుగ సందడి మొదలైంది. ఊరూరా ఆకట్టుకునే ముగ్గులు...గ్రామాల్లో గంగిరెద్దుల సందడి...పిండివంటల వాసనలు పల్లెల్లో ప్రకృతి అందాలు మత్తెక్కించేలా ఉన్నాయి. పండుగకు తోడుగా వరుస సెలవులు రావడంతో ప్రజలం తా తమ స్వస్థలాలకు బయలుదేరారు. పండగవేళ సొంతూరులో ఉండాలన్న ఆనందంలో ప్రజలంతా బయలుదేరడంతో నగరాలు ఖాళీ అవుతున్నాయి. ఇప్పటికే విద్యాసంస్థలకు సెలవులు ఇచ్చారు. దాదాపుగా అందరూ సెలవుల్లో ఉన్నట్లుగానే ఉన్నారు. భోగి,. సంక్రాంతి,కనుమ రోజులు వరుసగా సెలవులు రావడంలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులకు మూడు రోజులు వరుసగా సెలవులు కలిసి వస్తున్నాయి. సంక్రాంతి పండుగకు ఇంటికి వెళ్లి వచ్చేందుకు సెలవులు అనువుగా ఉండడంతో.. అంతా ఊరి బాట పట్టారు.. గతానికి భిన్నంగా ఉభయతెలుగు రాష్ట్రాల్లో ఆర్టీసీ ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయకుండా సర్వీసులు నడుపుతోంది. తెలంగాణలో మహిళలకు ఉచిత ప్రయాణం కలసి వస్తోంది. అయితే ప్రైవేట్ ట్రావెల్స్ వాళ్లు ఛార్జీల పేరుతో దోపిడీకి పాల్పడడం మాత్రం ఆగలేదు. ఇదే అదనుగా అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఇకపోతే ప్రైవేట్ విమానాల ఛార్జీలు కూడా ఆకాశాన్నం టాయి. హైదరాబాద్ నుంచి రాజమండ్రి, విజయవాడ, విశాఖ పట్టణం వెళ్లాలనుకున్న వారికి చుక్కలు చూపిస్తున్నారు. భోగి, మకర, కనుమ సంక్రాంతి పండుగల సందర్భంగా కళాశాలలు, పాఠశాలలకు ప్రభుత్వం ఐదు రోజుల పాటు సెలవులు ప్రకటించింది. , ఆది,సోమవారాలు పండగ కావడంతో సెలవులు పోయాయాన్న బాధలో ఉద్యోగులు ఉన్నారు. హైదరాబాద్‌లో ఉద్యోగ రీత్యా స్థిర నివాసం ఉంటున్న వారు, ఉన్నత విద్య అభ్యసించేందుకు హైదరాబాద్ లో ఉంటున్న యువతీ యువకులు పండుగల సందర్భంగా తమ స్వస్థలాలకు చేరుకుంటున్నారు. ఈ సందర్భం గా హైదరాబాద్‌లో బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి. పండుగకు పది రోజుల ముందుగానే రిజర్వేషన్లు చేసుకున్నారు. బస్సుల్లో సీట్లు దొరకక ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయిస్తుండగా.. ఇదే అదనుగా భావించి ప్రైవేట్ ట్రావెల్స్ వారు ఇష్టానుసారంగా టికెట్ రేట్లు పెంచి ప్రయాణికుల నుంచి డబ్బులు దండుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. హైదరాబాద్‌తో పాటు గుంటూరు, కాకినాడ, నెల్లూరు,విశాఖ,శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. డిపోల పరిధిలో ఆయా గ్రామాలకు ప్రయాణికులను తరలించేందుకు బస్సులను సిద్ధంగా ఉంచామని.. ప్రయాణికుల రద్దీని బట్టి అప్పటికప్పుడు బస్సు సమకూరుస్తామని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ప్రజల ఆదుర్దాను ప్రైవేటు ట్రావెల్స్‌వారు తమకు అనుకూలంగా మార్చుకొని భారీ ఎత్తున దోపిడీ చేస్తున్నారు. కొన్ని రూట్లలో టిక్కెట్ కంటే మూడు రెట్లు ధరలు పెంచేశారు. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబం పండుగకు వూరు వెళ్లి రావాలంటే ఖర్చు తడిసి మోపెడవుతోంది. విశాఖపట్నం లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లాంటే రాను పోను బస్సుల్లో రూ.15వేల వరకు వదిలించుకోవాల్సిందే. చాలీచాలని వేతనాలతో నగరంలో బతికే చాలా కుటుంబాలు ఈ టిక్కెట్ల ధరలు భరించలేక అసలు సంక్రాంతికి ఊరెళ్లడం మానుకు నే పరిస్థితి నెలకొంది. అటు రాయలసీమ జిల్లాలకు వెళ్లాలన్నా ఇదే తీరు. అడ్డగోలుగా భారీ ఎత్తున ధరలు పెంచినా సరే నియంత్రించే వారు లేకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్ ఆగడాలకు అడ్డు లేకుండా పోయిందని ప్రయాణికులు వాపోతున్నారు. మూడు నాలుగురోజుల నుంచే తమ దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులు వేసినా సరిపోని పరిస్థితి ఏర్పడింది. దీంతో పలు ప్రైవేటు ట్రావెల్స్ అడ్డగోలుగా ధరలు పెంచడం సామాన్య ప్రయాణికులకు పెనుభారంగా మారింది. చాలామంది ట్రావెల్స్ నిర్వాహకులు సీట్లను బ్లాక్ చేసి మూడింతలు, నాలుగింతల ధరలకు విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్‌లో బస్సుల టిక్కెట్లు విక్రయించే పోర్టళ్లకు ఎలాంటి నియంత్రణ ఉండటం లేదు. అప్పటికప్పుడు ఇవి అడ్డగోలుగా ధరలు పెంచి విక్రయిస్తున్నాయి. వారాంతం కోసం ముందే పెద్దఎత్తున టిక్కెట్ల ధరలు పెంచి సీట్లను విక్రయించడానికి పక్కా ప్రణాళిక రూపకల్పన జరిగిపోయింది. బహిరంగంగా దోపిడీ చేస్తున్నా సరే.. సంబంధిత అధికారులకు చీమ కుట్టినట్లైనా లేకపోవడం గమనార్హం. భారీ ఎత్తున ధరలు పెంచినా సరే నియంత్రించే వారు లేకపోవడంతో ప్రైవేటు ట్రావెల్స్ ఆగడాలకు అడ్డు లేకుండా పోయిందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రైవేటు ట్రావెల్స్‌కు బాగా కలిసొచ్చినట్లైంది. జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులంతా గురువారమే స్వగ్రామాలు, ప్రాంతాలకు బయలు దేరారు. దీంతో ప్రధాన రాహదారులపై వాహనాల రద్దీ పెరిగింది. ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసి పోయాయి. మసంక్రాతి పండుగ సందర్భంగా ప్రజలను వివిధ ప్రాంతాలకు తరలించేందుకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు డిపోల వారీగా అదనపు బస్సులను ఏర్పాటు చేశారు. జిల్లాలకు చెందిన బస్సులు హైదరాబాద్ నుంచి ఆంధ్రాప్రాంతానికి కూడా నడుపుతున్నారు. కాకినాడ, కడప, అనంతపురం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, రాజోలు ప్రాంతాలకు నడుపుతున్నారు. హైదరాబాద్‌తో పాటు ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో చదువుకునే విద్యార్థులకు ఈ బస్సుల్లో తమ స్వస్థలాలకు వచ్చేందుకు వీలుగా ఉండనున్నాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు వరంగల్, కరీంనగర్, నిజామాబాద్‌తో పాటు పల్లెలకు కూడా రద్దీని బట్టి అప్పటి కప్పుడు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసారు. గత సంక్రాంతి పండగకు ఆర్టీసీకి గణనీయంగా ఆదాయం సమకూరింది.

మొదటి పేజీ తరువాయి





కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులను రోడ్డున పడేసిందని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తంచేశారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో కార్మికులు తమ కుటుంబాలను పోషించుకోలేని స్థితిలో ఉన్నారని చెప్పారు. వారికి ప్రతి నెల రూ.15 వేల జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా డిగ్రీ కళాశాల మైదానంలో ఆటో డ్రైవర్ల ఆటల పోటీలను హరీష్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆటోకార్మికులు కొన్ని రోజులుగా నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ఒకరికి మంచి చేస్తూ ఇంకొకరి ఉసురు పోసుకోవద్దని సూచించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మంచి కార్యక్రమమే అయినప్పటికీ.. బస్సులు దొరక్క ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మారుమూల గ్రామాలకు మరిన్ని బస్ సౌకర్యాలు పెంచాలని తెలిపారు. ఆటో కార్మికులకు నెలకు 15వేల జీవన భృతి కల్పించాలని, లేదంటే వారు రోడ్డున పడే పరిస్థితి వస్తుందని వెల్లడించారు. ఆటోవాలలా జీవితంలో పండుగ వాతావరణం కనుమరుగైందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తమ బాధలు గట్టెక్కుతాయని అనుకున్నారని, కానీ వచ్చిన వారం రోజులకే ఇలా రోడ్డున పడతామని అనుకోలేదంటు న్నారని వ్యాఖ్యానించారు. రెక్కాడితే కానీ డొక్కాడని నిరుపేద ఆటో డ్రైవర్లను ప్రభుత్వం నడిరోడ్డుపై వదిలేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు.వారి సమస్యలపై అసెంబ్లీలో నిలదీస్తామని అన్నారు. దాదాపు 1480 మంది ఆటో డ్రైవర్లకు ఈ సొసైటీలో సభ్యులుగా ఉన్నారని.. వీరికి ఆటల పోటీలు నిర్వహించడం రాష్ట్రానికే ఆదర్శమని పేర్కొన్నారు. పట్టణానికే వారు బ్రాండ్ అంబాసిడర్లని.. సిద్దిపేటకు వచ్చే అతిథులను గౌరవ మర్యాదలతో గమ్య స్థానాలకు చేరుస్తున్నారని కొనియాడారు. అప్పుడప్పుడూ ఆటలు ఆడడం ఆరోగ్యానికి, మానసిక ఉల్లాసానికి దోహద పడతాయని చెప్పారు. సిద్దిపేట స్పోర్ట్స్ హబ్ గా మారిందని అన్నారు. ఒకరికి మంచి చేయాలనే ఉద్దేశంతో.. వేరొకరి కడుపు కొట్టొద్దని హరీష్ రావు ప్రభుత్వానికి సూచించారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మంచి కార్యక్రమమే అయినా.. ఆటో డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని వారిని ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలో 6 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు న్యాయం జరిగే వరకూ పోరాడతామని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్ల పిల్లల చదువులు, ఆరోగ్యానికి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అలాగే, ఉచిత బస్సు ప్రయాణం వల్ల రద్దీ పెరిగిందని మారుమూల గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం పెంచాలని కోరారు.

మొదటి పేజీ తరువాయి

## నూతన పారిశ్రామిక కారిడార్లు

హైదరాబాద్ వయా మిర్యాలగూడ -విజయవాడ నూతన పారిశ్రామిక కారిడార్ ఏర్పాటుకు ఆమోదం తెలపాలని కేంద్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ కు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌కు కేంద్ర ప్రభుత్వం తుది అనుమతులు మంజూరు చేయాలని కోరారు. కేంద్రం తుది అనుమతులు మంజూరు చేస్తే రాష్ట్రానికి రూ.2,300 కోట్లు విడుదలవుతాయన్నారు. తెలంగాణకు జాతీయ చేనేత సాంకేతిక కేంద్రం మంజూరు చేయాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. రాష్ట్రంలో ఏడు చేనేత క్లస్టర్స్ ఉన్నాయని, ఐఐహెచ్ మంజూరు చేస్తే నేత కార్మికులు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుని ఆదాయాలు పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. ఐఐహెచ్‌టీ ఎక్స్‌టెన్షన్ సెంటర్ ఏర్పాటుకు కేంద్ర మంత్రి సానుకూలత వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆయన కార్యాలయంలో శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి సంబంధించిన పలు సమస్యలను ముఖ్యమంత్రి కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్-వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో ప్రాధాన్య అంశంగా ఫార్మా సిటీని గత ప్రభుత్వం ప్రతిపాదించిందని, దానిని ఉప సంహరించుకొని నూతన ప్రతిపాదనలు పంపేందుకు అనుమతించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. యూపీఏ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌కు నేషనల్ డిజైన్ సెంటర్ (ఎన్ఐడీ) మంజూరు చేసిందని, నాటి కేంద్ర మంత్రి ఆనంద్ శర్మ దానికి శంకుస్థాపన చేశారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి గోయల్‌కు గుర్తు చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఎన్ఐడీని విజయవాడకు తరలించారని, ఈ నేపథ్యంలో తెలంగాణకు ఎన్ఐడీ మంజూరు చేయాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వం నెల్లూరు జిల్లాకు మెగా లెదర్ పార్క్ మంజూరు చేసిందని కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కరీంనగర్, జనగాం జిల్లాల్లో లెదర్ పార్క్ ఏర్పాటుకు అవసరమైన భూములున్నాయని, కేంద్ర ప్రభుత్వం మెగా లెదర్ పార్క్ మంజూరు చేస్తే వెంటనే భూమి కేటాయిస్తామని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ఇది మంచి ప్రతిపాదన అని, ఇందుకు సంబంధించిన అంశాన్ని పరిగణనలోకి తీసుకోవాలంటూ కేంద్ర మంత్రి సమావేశంలో పాల్గొన్న కేంద్ర అధికారులకు సూచించారు. కేంద్ర ప్రభుత్వం పీఎం మిత్ర పథకంలో భాగంగా వరంగల్‌లోని మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు బ్రౌన్ ఫీల్డ్ హోదా ఇచ్చిందని, దానికి గ్రీన్‌ఫీల్డ్ హోదా ఇవ్వాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి అభ్యర్థించారు. బ్రౌన్‌ఫీల్డ్ నుంచి గ్రీన్ ఫీల్డ్‌కు మార్చితే పార్క్‌కు గ్రాంట్ల రూపంలో అదనంగా రూ.300 కోట్ల నిధులు వస్తాయని, ఇది అక్కడి పరిశ్రమలకు ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. టెక్నికల్ టెక్స్ టైల్స్ (బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు, కన్వేయర్ బెల్టులు, ఎయిర్ బ్యాగ్‌లు తదితరాలు) టెస్టింగ్ సెంటర్ల ఏర్పాటుకు సుముఖంగా ఉన్నామని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ విషయంలో తెలంగాణ ఇప్పటికే సంసిద్ధత వ్యక్తం చేసినందున రాష్ట్రానికి టెస్టింగ్ సెంటర్ మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాల నుంచి కేంద్రం, రాష్ట్రానికి రావల్సిన నిధులు విడుదల చేయాలని, రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని సీఎం రేవంత్ కేంద్ర మంత్రిని కోరారు. రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తామని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు కేంద్ర మంత్రి అభినందనలు తెలిపారు. సమావేశంలో కేంద్ర పరిశ్రమల శాఖ సంయుక్త కార్యదర్శి బాలాజీ, కేంద్ర జౌళి శాఖ అదనపు కార్యదర్శి రోహిత్ కన్సల్, రాష్ట్ర జౌళి, చేనేత శాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి, టీఎస్ఐఐసీ సీఈవో మధుసూదన్, ఢిల్లీ తెలంగాణ భవన్ ఓఎస్డీ సంజయ్ జాజు, రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

## 44వ జాతీయ రహదారిపై అదుపు తప్పి బస్సు బోల్తా

**(అల్లంపూర్ జనవరి 13 మరో ఉదయం న్యూస్)**

అమెజాన్ జగన్ ట్రావెల్స్ కు సంబంధించిన ఏసి స్లీపర్ బస్సు ఏపీ39%శ%4663 శుక్రవారం రాత్రి ఏడున్నర గంటల ప్రాంతంలో హైదరాబాద్ మియాపూర్ నుండి చిత్తూర్ కి బయలుదేరినది మార్గమధ్యంలోజోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం పదవ బెటాలియన్ హెచ్ పి పెట్రోల్ బంక్ ముందు నిద్రమత్తులో లారీని ఓవర్టేక్ చేయబోయి జాతీయ రహదారి 44 పై బోల్తా పడిన అమెజాన్ జగన్ ట్రావెల్స్ కు సంబంధించిన ఏసి స్లీపర్ బస్సు ప్రమాద ఘటనలో సజీవ దహనమైన మహిళ ప్రయాణికురాలు హైదరాబాద్ మెహిది పట్నం కు చెందిన మాలతి ( 40 ) హైదరాబాదులోని ఇండియన్ ఇనిస్ట్యూట్ ఆఫ్ రైస్ రీసెర్చ్ సెంటర్లో సైంటిస్ట్ గా విధులు నిర్వహిస్తున్నారు, వీరి స్వస్థలం చిత్తూరు, భర్త మారుతి శ్రీనివాస్ రావు




చిత్తూరులో వ్యాపారం నిర్వహిస్తూ నడు సంక్రాంతి పండుగకు భర్త దగ్గరికి వెళ్తున్న సమయంలో సంఘటన చోటు చేసుకుంది , ప్రమాద సమయంలో బస్సులో 36 మంధి ప్రయాణిస్తుండగా 7 మందికి గాయాలు వీరిని అంబులెన్స్ ద్వారా కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, ఘటన స్థలాన్ని గద్వాల్ డిఎస్పి వెంకటేశ్వర్లు, అలంపూర్ సిఐ రాజు , ఇటిక్యాల ఎస్సై అశోక్ బాబు, అల్లంపూర్ నియోజకవర్గం శాసనసభ్యులు విజయుడు, గద్వాల్ శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి జిల్లా పరిషత్ చైర్పర్సన్ సరిత పరిశీలించారు.అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ముత్రాలి కుటుంబానికి తెలంగాణ ప్రభుత్వం 50 లక్షల రూపాయలు ఎక్రేసియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ముదిరాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ రీతిరాజ్ వివరణ ప్రమాదం డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ఎస్పీ తెలిపారు ఇటిక్యాల పోలీసులు మరియు పదవ బెటాలియన్ పోలీస్ సిబ్బంది మరియు హైవే పెట్రోలింగ్ పోలీసులు హైవే సిబ్బంది వెంటనే స్పందించి ప్రయాణికులను బయటకు తీయడం ద్వారా భారీ ప్రాణనష్టాన్ని నివారించగలిగామని జిల్లా ఎస్పీ తెలిపారు. ప్రమాదంలో అరుణ అనే మహిళ 10 తులాల బంగారం తన చేతి సంచిలో మరచిపోగా పోలీస్ వారు ఆ ప్రదేశంలో వెతికి కాలిన బంగారం ను ఆమె కొడుకు భార్గవులకు అప్పగించడం జరిగిందన్నారు.



## ఎర్రవల్లి బస్సు ప్రమాద స్థలాన్ని సందర్శించిన ఎమ్మెల్యేలు

**(అల్లంపూర్ జనవరి 13 మరో ఉదయం)**

శనివారం తెల్లవారు జామున బస్సు ప్రమాద స్థలాన్ని గద్వాల, అలంపూర్ ఎమ్మెల్యేలు సందర్శించి మృతురాలు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి..క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులకు ఆదేశించారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.తెల్లవారుజామున ఎర్రవల్లి చౌరస్తా లో జరిగిన సంఘటన బస్సు ప్రమాదంలో హైదరాబాద్ నుండి చిత్తూరుకు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్ జోగులాంబ గద్వాల జిల్లా బీచుపల్లి బెటాలియన్ పెట్రోల్ బంక్ ముందర శనివారం తెల్లవారుజామున బస్ అదుపు తప్పి బోల్తాపడడంతో బస్సు కాలిపోవడం అందులో చిక్కుకొని ఒక మహిళ మృతి , 2 వ్యక్తులకు తీవ్రగాయాలు గాయాలైన వారిని కర్నూల్ ప్రవేట్ ఆసుపత్రికి తరలించారుఈ సందర్భంగా గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ఘటన స్థలాన్ని ను పరిశీలించడం జరిగింది. బస్సు ప్రమాదంలో మృతి చెందిన మాలతి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్య అందించాలని అధికారులకు సూచించారు. తెల్లవారుజామునని బస్సు ప్రమాదం జరగడం చాలా బాధాకరమైన విషయమని, అదేవిధంగా ప్రవేట్ సంస్థ వాహనాల అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం తరపున బాధితుల కుటుంబాలకు ఆదుకోవాలని కోరారు.

**ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం** గద్వాల ఎమ్మెల్యే వెంట ఎంపీపీ ప్రతాప్ గౌడ్, జెడ్పిటిసి ప్రభాకర్ రెడ్డి, గట్టు మండలం పార్టీ అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి, మండలం సర్పంచులు సంఘం అధ్యక్షుడు హనుమంతు నాయుడు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేతలు గడ్డం కృష్ణారెడ్డి, రమేష్ నాయుడు విక్రమ్ సింహారెడ్డి,బజారి గోపాల్ రెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# పల్లెకు బయలుదేరిన పట్టణ ప్రజలు

## -సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో రద్దీ-అదనపు బస్సులు నడుతుపున్న ఆర్టీసీ

## -తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు-బోసిపోతున్న జంటనగరాలు

**హైదరాబాద్,జనవరి13(మరో ఉదయం)**

సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణ వాసులు సొంతూళ్లకు బయలుదేరారు. దీంతో నగగరాలు ఖాళీ అవుతున్నాయి. ఈ క్రమంలో బస్‌స్టేషన్లు, రైల్వే స్టేషన్లు జనంతో కిక్కిరిసిపోతున్నాయి. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రయాణికులతో రద్దీగా మారింది. ప్రయాణికులు టికెట్ల కోసం గంటల తరబడి కౌంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఈ నేపథ్యంలో రద్దీని తగ్గించేందుకు రైల్వే అధికారులు అదనంగా మరికొన్ని టికెట్ కౌంటర్లను ఏర్పాటు చేశారు. అదనంగా కౌంటర్లను ఏర్పాటు చేసి అందుబాటులోకి తీసుకుని వచ్చారు. అందుకుతగ్గట్లుగా సిబ్బందిని కూడా పెంచారు. రైల్వే స్టేషన్‌లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రైల్వే పోలీసులు భద్రతను ఏర్పాటు చేశారు. రైళ్ల రాకపోకల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రయాణికులకు తెలిపేందుకు అదనంగా మరికొంతమంది అధికారులను ఏర్పాటు చేశారు. సంక్రాంతి పండుగకు ప్రజలు సొంత ఊర్లకు వెళుతుండడంతో హైదరాబాద్ ఖాళీ అవుతోంది. శుక్రవారం వేకువజామున కూడా వందలాది వాహనాల్లో పలువురు తమ సొంతూళ్లకు బయలుదేరారు. శనివారం కూడా రద్దీ కొనసాగింది. యధావిదిగానే బస్సు స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో రద్దీ కనిపించింది. తెలంగాణ పల్లెలకు వెళ్లేవారు వివిధ రూట్లలో బయలు దేరారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నగరవాసులు పల్లెబాట పడుతున్నారు. దీంతో పండుగకు ఊరెళ్లే ప్రయాణికులతో రైళ్లు, బస్సులు కిటకిటలాడుతున్నాయి. హైదరాబాద్ నుంచి ఆంధ్రా ప్రాంతానికి వెళ్ళే రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై శనివారం వేకువ జామున భారీగా వాహనాలు నిలిచిపోయాయి. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సుమారు రెండు కిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోయాయి. టోల్ ప్లాజా వద్ద పది గేట్లు తెరిచినా వాహనాల రద్దీ తగ్గలేదు. ఇప్పటికే ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్లన్నీ బుకింగ్ అయ్యాయి. దూర ప్రాంత రెగ్యులర్ రైళ్లలో రెండు నెలల క్రితమే రిజర్వేషన్లు పూర్తవడంతో పాటు అదనపు ఛార్జీలతో నడిపే ప్రత్యేక రైళ్లలో సీట్లు నిండిపోయాయి. వీటిలో చాలా రైళ్లలో వెయిటింగ్ లిస్ట్ పరిమితి కూడా దాటిపోయింది. బెర్తు, సీటు దొరక్కపోయినా.. నిల్చొనైనా వెళ్దామనుకున్నా టికెట్లు బుక్ చేసుకునే పరిస్థితి లేదు. దీంతో సంక్రాంతికి సొంతూరుకు వెళ్లడమెలా అని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. సికింద్రాబాద్ తోపాటు కాచిగూడ, నాంపల్లి స్టేషన్లు

# 5 లక్షల ఎకరాల్లో కొత్త ఆయకట్టును సృష్టిస్తాం

**సాగునీటి ప్రాజెక్టులపై పూర్తి స్థాయిలో దృష్టి**

**నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**

**హైదరాబాద్,జనవరి13(మరో ఉదయం)**

ఈ ఏడాది చివరి నాటికి దాదాపు 5 లక్షల ఎకరాల్లో కొత్త ఆయకట్టును సృష్టించాలనే లక్ష్యంతో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై పూర్తి స్థాయిలో వ్యయం చేయబోతోందని నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం జలసౌధలో నీటి పారుదల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశం అనంతరం మీడియా ప్రతినిధుల సమావేశంలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున వృధా మరియు అనుత్పాదక వ్యయాన్ని సమీక్షా సమావేశంలో బహిర్గతం చేశామని వివరించారు. పర్యవసానంగా, ప్రస్తుత ప్రభుత్వం నీటిపారుదల కింద కొత్త ఆయ కట్టును పెంచడంపై దృష్టి సారించి, సరైన వ్యయానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. కొత్త ఆయకట్టును వేగంగా ఉత్పత్తి చేయగల ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని ఆయన నొక్కి చెప్పారు. మేము సమావేశంలో ప్రాజెక్టులు వ్యయం గురించి చర్చించామని 6 నెలల్లో మరియు సంవత్సరంలోపు కొత్త ఆయకట్టు లను సృష్టించగల వాటిని గుర్తించాము. మేము ఆరు నెలల్లో ఈ లక్ష్యాన్ని సాధించే ప్రాజెక్ట్‌లపై ఖర్చును పెంచాలనే నిర్ణయంతో కొత్త ఆయకట్ సృష్టికి కృషి చేస్తున్నామని సంవత్సరంలో డిసెంబర్ 2024 నాటికి 4.5 నుండి 5 లక్షల ఎకరాల్లో కొత్త ఆయకట్టులను సృష్టించడం మా లక్ష్యం" అని ఆయన నొక్కి చెప్పారు. మేడిగడ్డ బ్యారేజీ కుప్పకూలిన ఘటనపై విజిలెన్స్ విచారణ ప్రారంభించిన విషయాన్ని ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రస్తావించగా, బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై న్యాయ విచారణకు సిట్టింగ్ జడ్జిని నియమించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాసినట్టు చెప్పారు నీటి హక్కుల సమస్యను ప్రస్తావిస్తూ, తెలంగాణ నీటి హక్కులను కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతతో ఉందని అన్నారు. పాలమూరు రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ పథకానికి జాతీయ ప్రాజెక్టు హోదా కల్పించాలని కోరుతూ ఇటీవల ముఖ్యమంత్రితో కేంద్ర జల వనరుల శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిశామని. జాతీయ ప్రాజెక్టు హోదా కోసం నిర్దిష్ట పథకం లేదని కేంద్ర మంత్రి స్పష్టం చేసినా,



నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని వివరించారు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల కింద పాలమూరు రంగారెడ్డి నిధులు ఇస్తాని," కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ హామీ మేరకు ప్రాజెక్టు నిధుల కోసం ఈ వారంలో భారత ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతామని ఆయన తెలిపారు. అంబేద్కర్ ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరం ప్రాజెక్టుగా మార్చారని మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు విమర్శించారు. అసలు ఈ ప్రాజెక్టు కాళేశ్వరం ఖర్చులో నాలుగో వంతుతో 16 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టును సృష్టించేదని అన్నారు. సాగు నీటి ప్రాజెక్టుల విషయంలో కేసీఆర్ చేసిన తప్పిదాలపై ఆయన విచారం వ్యక్తం చేస్తూ, తెలంగాణ ప్రజలు తరతరాలుగా దుష్పరిణామాలను చవిచూడాల్సి వస్తోందన్నారు. సరైన ఖర్చుతో త్వరితగతిన కొత్త ఆయకట్టులను సృష్టించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డిపునరుద్ఘాటించారు. వేసవిలో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని నీటి చెరువులను పూడిక తీసి జంగిల్ క్లియర్ చేసే పనులు చేస్తామని ఆయన ప్రకటించారు. ప్రస్తుత నీటి కొరత దృష్ట్యా, రాబోయే తాగునీటి అవసరాలను తీర్చడానికి 10 టీఎంసీల కృష్ణా నీటిని కోరేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం కర్ణాటకలో పర్యటించనుందని ఆయన వివరించారు.

# విజయవాడ హైవేపై భారీ రద్దీ

## -సొంతూళ్లకు బయలదేరిన వందలాది వాహనాలు -ఆర్టీసీ బస్టాండ్లలో ప్రయాణికుల పడిగాపులు

## -వరుసగా రెండోరోజూ తప్పని ట్రాఫజక్ చిక్కులు

**హైదరాబాద్,జనవరి13(మరో ఉదయం)**

విజయవాడ జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. సంక్రాంతి పండక్కి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో జాతీయ రహదారులపై వాహనాల రద్దీ పెరిగింది. తెలంగాణ కంటే..ఆంధ్రప్రదేశ్ లో సంక్రాంతి పండగ భారీ స్థాయిలో జరుపుకుంటారు. ఎక్కడున్న కుటుంబ సభ్యులు అందరూ.. ఈ పండక్కి కలుసుకుని ఘనంగా జరుపుకుంటారు. పండక్కి వచ్చే జనాలతో ఏపీ గ్రామాలు కలకళలాడుతాయి. హైదరాబాద్ లో ఏపీ ప్రజలు పెద్ద సంఖ్యలోనే ఉంటారు. దీంతో పండక్కి సొంతూరుకు బయల్దేరి వెళ్తున్నారు. వరుసగా శుక్ర,శనివారాల్లోనూ నగరం నుంచి ఏపీకి వెళ్లే వాహనాలతో హైవేలపై వాహనాల రద్దీ నెలకొంది. దీంతో టోల్‌గేట్ల వద్ద పెద్ద ఎత్తున వాహనాలు బారులు తీరడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. సంక్రాంతి పండగ సెలవులు కావడంతో ప్రజలు సొంతవూర్లకు పయనమ వుతుండడంతో హైదరాబాద్ ఖాళీ అవుతోంది. సంక్రాంతి పండుగను పురస్క రించుకుని భాగ్యనగరం నుంచి గ్రామాలకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివెళ్లడంతో ఎక్కడికక్కడ పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ సమస్యలు తలెత్తాయి. దీనికితోడు ఉదయం నుంచి కురుస్తున్న వర్షం కారణంగా వాహనదారులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ముఖ్యంగా హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాలకు వేల సంఖ్యలో వెళ్తున్న వాహనాలతో రద్దీ వాతావరణం కనిపిస్తోంది. దీంతో హైదరాబాద్-విజయవాడ హైవేపై నల్గొండజిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేట్ దగ్గర వరుసగా మూడ్రోజులుగా భారీగా ట్రాఫిక్ జాం ఏర్పడింది. కిలోమీటర్ల



మేర వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనాలు టోల్ ప్లాజాల వద్ద ఆగడంతో రద్దీ చాలా పెరిగిపోతుందని వాహనదారులు చెబుతున్నారు. ఒకవైపు సొంత వాహనాలున్న వారు, మరోవైపు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో ఆంధ్ర ప్రాంతాలకు వెళ్లే వారి సంఖ్య అధికంగా ఉంది. శనివారం మకర సంక్రాంతిని కుటుంబసభ్యులతో జరుపు కోవాలని ఇళ్లకు పయనమ వుతున్నారు. ఈ నేపథ్యంలో ఓవైపు నగరం ఖాళీ అవుతుంటే.. పండక్కి గ్రామాలకు వెళ్లేవారితో టోల్ ప్లాజాల వద్ద వాహనాలు బారులు తీరుతున్నాయి. హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై అర్ధరాత్రివరకు వాహనాల జాతర నెలకొంది. సంకాంత్రి సెలవులు రావడంతో.. హైదరాబాద్ నుంచి స్వగ్రామాలకు ప్రయాణికులందరూ ఒకేసారి తరలివెళ్తున్నారు. రాజధాని నుంచి వచ్చే వాహనాలు యాదాద్రి భువనగిరిజిల్లా పంతంగి టోల్‌ప్లాజావద్ద బారులు తీరుతున్నాయి. ఖమ్మం, భద్రాది, నల్గొండ, గుంటూరు, ప్రకాశం, విజయవాడ, విజయనగరం, శ్రీకాకుళం వైపు వేళ్లే వాహనాలన్నీ ఈ టోల్ ప్లాజా మీదుగానే వెళ్లాల్సి ఉంటుంది. సాధారణ రోజుల్లో విజయవాడ వైపు వేల సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. వీటిలో కార్లు అధికంగా ఉన్నాయి. వాహనచోదకులు టోల్ చెల్లించ డానికి సుమారు అరగంటసేపు వేచిచూడాల్సి వచ్చింది. పోలీసులు జోక్యం చేసుకొని టోల్ చెల్లింపు కేంద్రాలను ఎక్కువగా తెరిపించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. పండక్కి రెండు రోజుల ముందే సొంతూళ్లకు పయన మవడంతో రహదారులపై వాహనాల రద్దీ పెరిగింది. మరీ ముఖ్యంగా.. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై సంక్రాంతి రద్దీ కొనసాగుతోంది. దీంతో పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితిని చక్కదిద్దాల్సి వచ్చింది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో ఉదయం నుంచే తీవ్రంగా ట్రాఫిక్ రద్దీ నెలకొంది. పెద్దసంఖ్యలో వాహనాల రాకపోకలు కొనసాగుతుండటంతో ప్రజలు రోడ్డు దాటేందుకు సైతం ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌గేటు వద్ద వాహనాలు బారులుతీరాయి. టీఎస్ ఆర్టీసీ సంక్రాంతికి అదనపు వడ్డన లేకుండా సాధారణ చార్జీలతో ప్రత్యేక బస్సులు నడుపుతుండడంతో ఎక్కువ మంది ఆ బస్సుల్లోనే వెళ్లేందుకు మొగ్గుచూపుతున్నారు. మహిళలకు ఫ్రీ కావడంతో రద్దీ పెరిగింది. ఏపీఎస్ ఆర్టీసీ నడుపుతున్న ప్రత్యేకబస్సుల్లో 50శాతం అధిక చార్జీ వసూలు చేస్తుండడంతో ఏపీవాసులు సైతం హైదరాబాద్ నుంచి సొంతూరికి వెళ్లడానికి టీఎస్ ఆర్టీసీ బస్సులకే ప్రాధాన్యమిస్తున్నారు.గడిచిననాలుగు రోజుల్లో టీఎస్ ఆర్టీసీ ఏపీ, తెలంగాణల్లోని పలు జిల్లాలకు 2,700కు పైగా ప్రత్యేక సర్వీసులను నడిపింది. రద్దీ పెరిగితే మరిన్ని అదనపు బస్సులు నడుపుతామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. ఇక.. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఎంజీబీఎస్‌లో ప్రయాణికుల రద్దీ తీరును, ప్రత్యేక బస్సులను టీఎస్ ఆర్టీసీ ఎండీ

# ఏపీలో శరవేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు

## మరోసారి ముద్రగడతో జనసేన చర్చలు

**విజయవాడ,జనవరి13(మరో ఉదయం):**

ఏపీలో రాజకీయ సమీకరణాలు శరవేగంగా మారుతున్నాయి. ముఖ్యంగా గోదావరి జిల్లాలపై వైసీపీ, టీడీపీ-జనసేన కూటమి ప్రత్యేక ఫోకస్ పెట్టాయి. ఈ క్రమంలో కీలక నేతలకు గాలం వేస్తున్నాయి. కుల సమీకరణాలు ఆధారంగా పావులు కదుపుతున్నాయి. ఈ నేపథ్యంలో కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం చుట్టూ నేతలు చక్కర్లు కొడుతున్నారు. కొంతకాలంగా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్న ముద్రగడ తొలుత వైసీపీలో చేరతారనే ప్రచారం జరిగింది. ఇదే సమయంలో టీడీపీ-జనసేన నేతలు పావులు కదిపారు. జనసేన నేత బొలిశెట్టి శ్రీనివాస్ రెండు రోజుల క్రితం ముద్రగడను కలిశారు. ఆయనతో చర్చలు జరిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ పంపిన సందేశాన్ని ఆయనకు వివరించారు. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే టీడీపీ నేత జ్యోతుల నెహ్రూ ముద్రగడ ఇంటికి వెళ్లడం ఆసక్తిగా మారింది. టీడీపీ అధినేత చంద్రబాబు దూతగానే జ్యోతుల నెహ్రూ.. ముద్రగడ ఇంటికి వచ్చారనే చర్చ జరిగింది. తాజాగా జనసేన నేత బొలిశెట్టి శ్రీనివాస్ మరోసారి ముద్రగడను కలవడం ఆసక్తికరంగా మారింది. పవన్ నే స్వయంగా కిర్లంపూడి వచ్చి ముద్రగడను కలుస్తారనే బొలిశెట్టి వెల్లడించారు. ఈ నెల 20 లేదా 23న ముద్రగడతో పవన్ కల్యాణ్ భేటీ అవుతారని తెలిపారు.

# బీసీలకు న్యాయం జరగడం లేదు

## రావాల్సిన వాటా, రావాల్సిన రిజర్వేషన్ రావడం లేదు

## జస్టిస్ ఈశ్వరయ్య కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్,జనవరి13(మరో ఉదయం):**

దేశవ్యాప్తంగా ఉన్న బీసీ ఫెడరేషన్, బీసీ సంఘాల నాయకులు ఢిల్లీలో రాహుల్ గాంధీనీ కలిశామని తెలిపారు జస్టిస్ ఈశ్వరయ్య. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ జాతీయ జన గణన చేయటం లేదు%‌ోా% ఎలాంటి ఎంక్వయిరీ చేయకుండా అగ్రకులాలకు 10% రిజర్వేషన్లు కేటాయించిందని మండిపడ్డారు. అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు చేస్తా ఉందని, మండల కమిషన్ సిఫార్సులను పట్టించుకోవడం లేదన్నారు. రామాలయం పేరుతో ఇంటింటికి అక్షింతలు పెడుతున్నారు తప్ప కుల జనగణ చేపట్టడం లేదని, బీసీలకు రావాల్సిన వాటా , రావాల్సిన రిజర్వేషన్ రావడం లేదన్నారు ఈశ్వరయ్య. ఇండియాకుటమిలో ఒక్క రాహుల్ గాంధీ తప్ప బీసీ జన గణను ఎవరు మాట్లాడటం లేదని, ఇండియా కూటమికి కి బిసి ఫెడరేషన్, బీసీ సంఘాలు మద్దతు ఇస్తామని ఆయన వెల్లడించారు. భారత్ జూడో న్యాయయాత్రకు మద్దతు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. అంతేకాకుండా.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది అక్కడ బీసీ జనగణ చేపట్టాలని కోరారు. తెలంగాణలో బీసీ జనగణ చేపటడం వల్ల దేశవ్యాప్తంగా ఉన్న బీసీ జనాలు కాంగ్రెస్ నమ్ముతారని, పొలిటికల్ పవర్ వస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్ మాట్లాడుతూ.. జస్టిస్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో బీసీ ఫెడరేషన్ తరఫున అన్ని రాష్ట్రాల నుంచి రాహుల్ గాంధీని కలిసామన్నారు. బీసీ జనగణ జరపాలని రాహుల్ గాంధీ గారు పార్లమెంట్లో చెప్పారని, మొట్టమొదటిసారి బీసీ ఫెడరేషన్ ఒక రాజకీయ పార్టీకి మద్దతు ఇస్తా ఉందన్నారు. ఇండియాకుటమికి దేశవ్యాప్తంగా ఉన్న బిసి ఫెడరేషన్ మద్దతు ఇవ్వాలని నిర్ణయం తీసుకుందన్నారు.

# ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ కొరడా

## ఫైర్ సేఫ్టీ లేని 15 బస్సులపై కేసులు నమోదు

**హైదరాబాద్,జనవరి13(మరో ఉదయం):**

సంక్రాంతి పండుగ సందర్భంగా నగరవాసులు పల్లె బాట పట్టారు. తమ సొంతూరిలో అయినవారి మధ్య పండగ సంబరాలను జరుపుకోవడానికి భారీ సంఖ్యలో వివిధ ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. దీంతో బస్సులు, రైళ్లు అన్నీ ప్రయాణీకులతో నిండిపోతున్నాయి. ప్రయివేట్ ట్రావెల్ బస్సులు కూడా పండగ సీజన్ ను క్యాష్ చేసుకునే పనిలో ఉన్నాయి. అయితే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రవేట్ ట్రావెల్స్ బస్సులపై ఆర్టిఏ అధికారుల దాడులు నిర్వహించారు. మహబూబ్‌నగర్ బస్సు ప్రమాదం నేపథ్యంలో ఆర్టీఏ అధికారులు అప్రమత్తమయ్యారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ అధికారులు దాడులు నిర్వహించారు. ఎల్బీ నగర్ చింతలకుంట వద్ద అధికారులు తనిఖీలు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న 15 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై కేసులు నమోదు చేశారు. బస్సుల్లో కనీసం ఫైర్ సేఫ్టీకి ఏర్పాట్లు చేయకుండా పలు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలు నిబంధనలను తుంగలో తొక్కాయి. రూల్స్ పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.సంక్రాంతికి భారీగా సొంతూళ్లకు జనం వెళ్తున్నారు. పంతంగి టోల్ ఫ్లాజా వద్ద వాహనాల రద్దీ కొనసాగుతుంది. ఈ టోల్ వద్ద హైదరాబాద్- విజయవాడ వైపు పది టోల్ బూత్‌లను జీఎంఆర్ ఓపెన్ చేసింది. అలాగే నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్ల పహాడ్ వద్ద కూడా రద్దీ కొనసాగుతోంది. కొర్లపహాడ్ వద్ద ఎనిమిది టోల్ బూత్‌లను సిబ్బంది తెరిచారు.

# శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు రామ్‌చరణ్ దంపతులకు ఆహ్వానం

**హైదరాబాద్,జనవరి13(మరో ఉదయం):**

జనవరి 22న జరగనున్న శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు అయోధ్య నుంచి ప్రముఖులకు, రాజకీయ నాయకులకు, వ్యాపారులకు, సినీనటులకు ఆహ్వానాలు అందుతున్నాయి. రామమందిర ట్రస్టు ప్రతినిధులు హీరో రామ్‌చరణ్, ఉపాసన దంపతులను ఆహ్వానించారు. ఇప్పటివరకు చిరంజీవి, ప్రభాస్, అమితాబ్ బచ్చన్, రణ్‌బీర్ కపూర్ దంపతులు, రాజ్‌కుమార్ హిరాణీ, రోహిత్ శెట్టి, ధనుష్ ఆహ్వానాలు అందుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠకు దేశ ప్రజల తరపున ప్రతినిధిగా ఉండనుండటం తన అదృష్టమని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని 11 రోజులపాటు ప్రత్యేక ఆరాధన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవం ప్రపంచవ్యాప్తంగా ఉన్న రామభక్తులందరికీ ఒక పవిత్రమైన సందర్భమని మోదీ అన్నారు.

# వీధి కుక్కల దాడిలో 7 నెలల బాలుడి మృతి

## మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్ నగరంలో ఘటన

**భోపాల్,జనవరి13(మరో ఉదయం):**

విధికుక్కలు చిన్నారుల ప్రాణాలను తీస్తున్నాయి. ఇటీవల పలు రాష్ట్రాల్లో ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. తాజాగా మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్ నగరంలో ఏడు నెలల బాలుడిపై వీధికుక్కలు దాడి చేసి ప్రాణం తీశాయి. ఈ ఘటన బుధవారం నగరంలోని అయోధ్య నగర్ ప్రాంతంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సంఘటనను పోలీసులు, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు అధికారులు వెల్లడించారు.ఈ ఘటన జరిగిన రోజున పిల్లాడి మృతదేహాన్ని పూడ్చి పెట్టారు. పోలీసులు మళ్లీ మృతదేహాన్ని వెలికి తీసి, శనివారం పోస్టుమార్టం కోసం పంపారు. చిన్నారి తల్లిదండ్రులు కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. తల్లి పిల్లాడిని నేలపై పడుకోబెట్టి పక్కనే పనిచేసుకుంటుండగా.. ఈ దాడి జరిగినట్లు అయోధ్య నగర్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ నిల్హారే తెలిపారు. కుక్కల గుంపు చిన్నారిని కొరికి ఈడ్చుకెళ్లిందని చెప్పారు. కుక్కల దాడిలో శిశువు శరీరం నుంచి చేయి విడిపోయింది, అక్కడిక్కడే మరణించినట్లు అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉంటే జిల్లా యంత్రాంగం బాలుడి కుటుంబానికి రూ. 50,000ల ఆర్థిక సాయాన్ని అందించింది. మరో రూ. 50,000 త్వరలో అందిస్తామని అధికారులు చెప్పారు. భోపాల్ మునిసిపల్ కార్పొరేషన్ అయోధ్య నగర్ ప్రాంతం నుండి ఎనిమిది వీధి కుక్కలను పట్టుకుంది.

# సినిమా వార్తలు

## కమల్ మరో సినిమాతో రెడీ

ఉలగనాయగన్ కమల్ హాసన్ మరో సినిమాకు సైన్ చేశారు. చాలా గ్యాప్ తర్వాత వచ్చిన 'విక్రమ్' సినిమా కమల్ హాసన్‌లో ఎనర్జీని నింపడంతో.. ఇక వరసగా సినిమాలు చేస్తానని ప్రకటించిన ఈ యూనివర్సల్ స్టార్.. చెప్పినట్లుగానే వరసగా సినిమాలు చేసేందుకు రెడీ అవుతున్నారు. ప్రస్తుతం దిగ్గజ దర్శకుడు మణిరత్నం డైరెక్షన్‌లో మోస్ట్ అవైటెడ్ గ్యాంగ్ స్టర్ యాక్షనర్ 'థగ్ లైఫ్' చేస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ జరుపుకుంటోంది. మరోవైపు కమల్ హాసన్ మోస్ట్ ఎవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ కు సంబధించిన ఓ క్రేజీ అప్డేట్ ఇచ్చారు. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్‌లు అన్బరివ్(అన్బుమణి, అరివుమణి) దర్శకత్వం వహిస్తున్నట్లుగా అధికారికంగా ప్రకటించారు. ఈ విషయాన్ని కమల్ హాసన్ తెలియజేస్తూ.. 'ఇద్దరు ప్రతిభావంతులు, వారి కొత్త అవతార్‌లో దర్శకులుగా చేరడం గర్వంగా ఉంది. మాస్టర్స్ అన్బరివ్ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌కి తిరిగి స్వాగతం' అని ట్వీట్ చేశారు. ప్రస్తుతం ఆయన చేసిన ఈ ట్వీట్ వైరల్ అవుతోంది.కమల్ హాసన్, ఆర్ మహేంద్రన్ తమ రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన మరిన్ని వివరాలను త్వరలోనే మేకర్స్ తెలియజేయనున్నారు.



## రాచరికంలో భయపెట్టేలా సీన్స్





విజయ్ శంకర్, అప్సరా రాణి హీరోహీరోయిన్లుగా చిల్ బ్రోస్ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై రూపుదిద్దు కుంటోన్న సినిమా'రాచరికం'. ఈశ్వర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తుండగా.. సురేష్ లంకలపల్లి కథ, కథనాన్ని అందిస్తూ దర్శకత్వం వహిస్తున్నారు. రీసెంట్‌గానే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు జరిగాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన అప్డేట్‌ని మేకర్స్ వదిలారు. హీరోయిన్ అప్సరా రాణి పుట్టిన రోజు జనవరి 12 సందర్భంగా ఈ సినిమా నుండి ఆమెకు సంబంధించిన స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్ చూస్తుంటే.. ఇప్పటి వరకు గ్లామర్‌కే పరిమితమైన అప్సరా రాణికి ఇందులో అద్భుతమైన పాత్ర లభించినట్టుగా కనిపిస్తోంది. కాళీ మాత ఉగ్ర రూపం దాల్చితే, రక్తంతో ఒళ్లంతా తడిసి ము÷-దదైతే ఎలా ఉంటుందో.. ఈ పోస్టర్‌లో అప్సరా రాణి అలా ఉన్నారు. ఈ పోస్టర్‌తో ఒక్కసారిగా సినిమాపై అంచనాలు పెంచేశారు. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించి మరిన్ని అప్డేట్స్ వస్తాయని చిత్రయూనిట్ అంటోంది. విజయ రామరాజు, శ్రీకాంత్ అయ్యంగార్, మహబూబ్ బాష, రూపేష్ మర్రాపు, ప్రాచీ థాకర్, లత, ఈశ్వర్ తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తోన్న ఈ సినిమాకు వెంగి సంగీతాన్ని అందిస్తుండగా.. ఆర్య సాయి కృష్ణ కెమెరామెన్‌గా పని చేస్తున్నారు. ప్రస్తుతం అప్సరా రాణికి సంబంధించిన ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. నెటిజన్లు కూడా పాజిటివ్‌గా స్పందిస్తుండటం విశేషం.



## ముగ్గురు మిత్రుల కథే సామిరంగ

### నేడు విడుదల కాబోతున్న నాగ్ మూవీ

'చాలా విరామం తర్వాత నేను నటించిన మాస్ సినిమా ఇది. నా గత చిత్రాలతో పోల్చితే యాక్షన్ ఘట్టాలు ఎక్కువగా ఉంటాయి. ఈ సంక్రాంతి సీజన్‌లో పర్‌ఫెక్ట్ మూవీ అని చెప్పొచ్చు' అన్నారు అగ్ర హీరో నాగార్జున. ఆయన నటించిన తాజా చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకుడు. ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా నాగార్జున పాత్రికేయులతో ముచ్చటిస్తూ పంచుకున్నారు. కేవలం 35 రోజుల్లోనే పూర్తయిన నా చిత్రాలు చాలానే ఉన్నాయి. 'నా సామిరంగ' 72 రోజులు పాటు షూటింగ్ జరుపుకుంది. నేను అరవై రోజుల పాటు పనిచేశాను. అయితే షూటింగ్ డేట్ మొదలుకొని రిలీజ్ డేట్ వరకు పక్కా ప్రణాళికతో వేగంగా పూర్తి చేసిన సినిమా మాత్రం ఇదే. మలయాళ మూల కథకు తెలుగు నేటివిటీకి అనుగుణంగా చాలా మార్పులు చేసి ఈ సినిమాను తెరకెక్కించాం. ముగ్గురు మిత్రుల స్నేహబంధం చుట్టూ కథ నడుస్తుంది. ఇందులో ప్రేమ, త్యాగం, నమ్మకం..ఇలా అన్ని అంశాలుంటాయి. హృదయాన్ని కదిలించే ఎమోషన్స్‌తో కూడిన అద్భుతమైన కథ అన్నారు. భోగి, సంక్రాంతి, కనుమ.. ఈ మూడు రోజుల్లో జరిగే కథ ఇది. 1980 నేపథ్యంలో నడుస్తుంది. తెరపై సంక్రాంతి పండగను చూస్తున్న అనుభూతి కలుగుతుంది. కథాంశం తగినట్లు సంక్రాంతి రోజున విడుదల కావడం ఆనందంగా ఉంది. సినిమాలో నా పాత్ర పేరు కిష్టయ్య. అతను స్నేహం కోసం ఎంతవరకైనా వెళ్తాడు. హీరోయిన్ ఆషికా రంగనాథ్‌తో నాకో ప్రేమకథ కూడా ఉంటుంది. దర్శకుడు విజయ్ బిన్నీ కొరియోగ్రాఫర్ కావడం వల్ల పాటలోనే కథను చెప్పే మంచి నేర్పు ఉంది. ఆయనలోని ఈ ప్రతిభ నచ్చే దర్శకుడిగా అవకాశమిచ్చాను. నా స్నేహితులుగా అల్లరి నరేష్, రాజ్‌తరుణ్ అద్భుతమైన పర్‌ఫార్మెన్స్ కనబరిచారు. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా. ఈ నెలాఖరులో షూటింగ్ మొదలవుతుంది. ఆ తర్వాత కొత్త దర్శకుడితో యాక్షన్ సినిమా చేయబోతున్నా. 'పఠాన్' తరహాలో సాగే డిఫరెంట్ యాక్షన్ జోనర్ చిత్రమది.



## రాఖీ సావంత్ పిటిషన్ కొట్టివేత

రాఖీ సావంత్ చిక్కుల్లో పడింది. ఆమె దరఖాస్తు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటీషన్‌ను కోర్టు తిరస్కరించింది. ముంబైలోని దిందోషి కోర్టు ఆ పిటీషన్‌ను కొట్టిపారేసింది. జనవరి 8వ తేదీన జరిగిన విచారణలో అదనపు సెషన్స్ జడ్జి శ్రీకాంత్ వై భోంసలే ఆదేశాలు ఇచ్చారు. శుక్రవారమే ఆ ఆర్డర్‌కు చెందిన పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చాయి. తన ప్రైవేటు వీడియోలను రాఖీ సావంత్ లీక్ చేసినట్లు ఆమె మాజీ భర్త అనిల్ దురానీ కోర్టులో కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఐటీ చట్టంలోని సెక్షన్ల ప్రకారం సావంత్‌పై అంబోలీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR,Printed at M/S Kakatiya Printers,H.No.24-91/72,73,74 IDA,Uppal,Uppal Mandal,Medchal-Malkajgiri District, Telangana, Published at, H.No. 1-5-631/276,Ambedkar Colony, Old Alwal Village, Alwal Mandal, Medchal-Malkajgiri District,Telangana., Cell : 91548 42842, Editor: GILAKARA SRIDHAR RNI No. TELTEL/2016/71618., Email : maroudayam20@gmail.com